క్లుప్తంగా

ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

తలకొండపల్లి: మండల కేంద్రంలో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ అనిల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆధార్ సెంటర్ లేకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆధార్‌లో మార్పులు చేర్పుల కోసం వెల్దండ, కల్వకుర్తి, ఊరుకొండపేట, మిడ్జిల్ గ్రామాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇదే విషయాన్ని జిల్లా కలెక్టర్‌కు లేఖ ద్వారా వివరించామని తెలిపారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

ఎంపీపీ కృపేష్



పోచారంలో పరిసరాలను శుభ్రం చేస్తున్న కృపేష్, ఇంద్రసేనారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇబ్రహీంపట్నం ఎంపీపీ కృపేష్ సూచించారు. మంగళవారం ఇబ్రహీంపట్నం మండలంలోని పోచారం గ్రామంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కృపేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రత్యేక కార్యక్రమాలను గ్రామాల్లో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు సమన్వయంతో ముందుకుపోవాలని సూచించారు. దోమల బెడద లేకుండా నివారణ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి ఇంద్రసేనారెడ్డి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయయాత్రకు కాంగ్రెస్ నాయకులు



వంశీచంద్‌రెడ్డిని కలిసిన ప్రభాకర్‌రెడ్డి

తలకొండపల్లి: పాలమూరు న్యాయయాత్రకు కాంగ్రెస్ మండల నాయకులు తరలివెళ్లారు. యాత్ర చేస్తున్న సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు, ఏఐసీసీ నాయకుడు చల్లా వంశీచంద్ రెడ్డిని తలకొండపల్లి కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి, ఉపాధ్యక్షుడు భగ్‌వాన్‌రెడ్డి, దామోదర్, డేవిడ్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి



మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం: మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ మున్సిపల్ కన్వీనర్ ఎల్లేశ్ డిమాండ్ చేశారు. 16న జరిగే దేశ వ్యాప్త సమ్మె నోటీసును మంగళవారం ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్‌కు కార్మికులతో కలిసి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికులకు వేతనాల పెంపు, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని తదితర డిమాండ్లతో 16న నిర్వహించే సమ్మెలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు లక్ష్మయ్య, యాదయ్య, రాజు, కప్పటి రాజు, రవీందర్, యాదగిరి, స్వప్న, సమంత, ఇందిరమ్మ, సుజాత, భారతమ్మ, జయమ్మ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో వేణుగోపాల స్వామి

కడ్తాల్: మండలంలోని మక్తమాధారం గ్రామంలో కొలువైన వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, స్వస్తివాచనం, ఋత్విగ్వరణం, రక్షాబంధనం, అంకురార్పణం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ మేరకు భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు వింజమూరు రామానుజన్ చార్యులు, ఆదిత్యాచార్యులు స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

కూలీలు కావలెను..!

- నెలలు గడుస్తున్నా అందని వేతనాలు
- అర్ధాకలితో పనులు చేయలేమని తేల్చిచెబుతున్న కూలీలు
- నచ్చచెబుతున్న అధికారులు



చౌదర్‌పల్లి గ్రామంలో భూ అభివృద్ధి పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలకు నిబంధన ప్రకారం 15 రోజుల్లోగా వేతనాలు చెల్లించాలి. రెండు వారాల్లో ఇవ్వాల్సిన పైసలు నెలలు గడుస్తున్నా.. ఇవ్వకపోవడంతో అర్ధాకలితో పనులు చేయలేమని కూలీలు తేల్చిచెబుతున్నారు. సకాలం బిల్లులు చెల్లించకపోవడంతో ఉపాధి కూలీలు ముఖం చాటేస్తున్నారు. ఉపాధి పనులకు రావాలని ఈజీఎస్ అధికారులు నచ్చచెబుతున్నారు.

యాచారం: కూలీలు ఉపాధి పనులకు వెళ్లడానికి ఆసక్తి చూపడం లేదు. యాచారం మండలంలోని 24 గ్రామాల్లో 13 వేల జాబ్ కార్డులు ఉన్నాయి. ప్రతి ఏటా 8 వేల మంది కూలీలు ఉపాధి పనులు చేస్తారు. నాలుగైదు ఏళ్లుగా భూగర్భజలాలు పుష్కలంగా ఉండడంతో ఉపాధి కూలీలు వ్యవసాయ పనులకు వెళ్లడం వలన ఉపాధి పనులకు వెళ్లడానికి ఆసక్తి చూపలేదు. ప్రస్తుతం బోరుబావుల్లో భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టాయి. వ్యవసాయ పనులు కూడా తగ్గాయి. అయినా కూలీలు ఉపాధి పనులకు రావడానికి ఆసక్తి చూపడం లేదు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీలకు దినసరి కూలీ రూ.272 నిర్ణయించింది. యాచారం, చింతపట్ల, నందివనపర్తి, నక్కర్తమేడిపల్లి, గునుగల్, మంతన్‌గౌరెల్లి, నల్లవెల్లి తదితర గ్రామాల్లో వేలాది మంది కూలీలు ఉన్నప్పటికీ ఉపాధి పనులకు వచ్చేందుకు ముఖం చాటేస్తున్నారు.

పనులు ఫుల్

ఉపాధి పనులు చేసుకోవడానికి గ్రామాల్లో గుర్తించిన పనులు చాలా వరకు ఉన్నాయి. వ్యవసాయ భూముల్లో భూ అభివృద్ధి పనులు, చెట్లకు పాదులు తీయడం, డొంక రోడ్లు వెడల్పు చేయడం, నర్సరీల్లో మొక్కలు పెంచడం, నీళ్ల పోయడం తదితర పనులు ఉన్నాయి. మండలంలో 24 గ్రామ పంచాయతీలు, మరో 20 అనుబంధ గ్రామాల్లో 13 వేల జాబ్‌కార్డుల్లో దాదాపు 15 వేలకు పైగా ఉపాధి కూలీలు ఉన్నారు. ప్రతి ఏటా 8 వేలకు పైగా కూలీలు ఉపాధి పనులు చేసుకునే అవకాశం ఉంది. కానీ యాచారం మండలంలో ప్రస్తుతం 700 మంది మాత్రమే ఉపాధి పనులకు వెళ్తున్నారు. ఆయా గ్రామాల్లో ఈజీఎస్ క్షేత్ర సహాయకులు కూలీలను కలిసి ఉపాధి పనులకు రావాలని కోరుతున్నా.. స్పందన లేకుండా పోతోంది. గతంలో చేసిన ఉపాధి పనులకే వేలాది రూపాయలు బిల్లులు రావాలని కూలీలు అంటున్నారు. యాచారం, నందివనపర్తి, కొత్తపల్లి, నల్లవెల్లి, తక్కళ్లపల్లి, అయ్యవారిగూడెం, నస్దిక్‌సింగారం, మంతన్‌గౌరెల్లి తదితర గ్రామాల్లో ఉపాధి కూలీలకు వేలాది రూపాయల బకాయిలు అందాల్సి ఉంది.

వ్యవసాయానికి అనుసంధానం చేయాలి



ఉపాధి పనులకు వ్యవసాయ పనులకు అనుసంధానం చేయాలి. కూలీ రేట్లు అధికమవ్వడంతో రైతులు పెట్టుబడులకు అప్పులు చేస్తున్నారు. వ్యవసాయ పనులను కూలీల ద్వారా చేయిస్తే ఈజీఎస్ నుంచి కొన్ని నిధులు, మరికొన్ని నిధులు రైతుల ద్వారా చెల్లించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలి. అప్పుడే రైతు అప్పుల పాలు కాకుండా ఉంటాడు.

– మర్పల్లి బాలరాజ్ యాదవ్, రైతు మొండిగౌరెల్లి

అధికారులు కృషి చేయాలి



ఉపాధి పనులు చేస్తే కూలీలకు వారం, వారం బిల్లులు ఇవ్వకపోవడం వల్లే ఆసక్తి చూపడం లేదు. మా గ్రామంలో వందలాది మంది కూలీలు ఉన్నారు. సకాలంలో బిల్లులు రాకపోవడమే పనులకు పోవడం లేదు. బిల్లులు ఇచ్చే విషయంలో అధికారులు కృషి చేయాలి.

– జ్యోతినాయక్, ఎంపీటీసీ సభ్యురాలు, మంతన్‌గౌరెల్లి

ఉపాధి పనులకు రండి



గ్రామాల్లో కూలీలకు సరిపడా ఉపాధి పనులు గుర్తించడం జరిగింది. ఉపాధి పనులకు రావాలని కూలీలను అడుగుతున్నాం. ప్రసుత్తం మండలంలో 700 మంది కూలీలే పనులకు వస్తున్నారు. మరో వారంలో రెండు, మూడు వేల మంది కూలీలు ఉపాధి పనులకు వచ్చే అవకాశం ఉంది. బిల్లులు సకాలంలో అందేలా కృషి చేస్తాం.

– లింగయ్య, ఈజీఎస్ ఏపీఓ యాచారం

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

- అలివేలు మంగాసమేత వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి
- ఐదు రోజుల పాటు వేడుకలు
- 15న కల్యాణోత్సవం



ఎంపీ రాములుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న సత్యం

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం శెట్టిపల్లిలో వెలసిన అలివేలు మంగాసమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 14 నుంచి 18వ తేదీ వరకు జరగనున్నాయి. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను గ్రామ మాజీ సర్పంచ్ గోదాదేవి సత్యం, ఆలయ చైర్మన్ శ్రీనివాస్, ఆలయ వ్యవస్థాపక ట్రస్టీ జగన్‌మోహన్ పర్యవేక్షిస్తున్నారు. ఉత్సవాల్లో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కార్యక్రమాల వివరాలు

బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈ నెల 14 సాయంత్రం గణపతి పూజ అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. 15వ తేదీన స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు, 11 గంటలకు శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం, సాయంత్రం సామూహిక కుంకుమార్చన, 16న సుదర్శనహోమం, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, 11 గంటలకు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహిస్తారు. 17న ప్రత్యేక పూజలు, చక్రతీర్థం, 18న స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు, బ్రాహ్మణ సత్కారాలు, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 15 నుంచి మూడు రోజుల పాటు రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు.

ఎంపీ, ఎమ్మెల్యేకు ఆహ్వానం

అలివేలు మంగా సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిని ఆలయ నిర్వాహకులు ఆహ్వానించారు. హైదరాబాద్‌లో రాములు, కసిరెడ్డి నారాయణరెడ్డిని శెట్టిపల్లి మాజీ సర్పంచ్ సత్యం, ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు కలిసి ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శెట్టిపల్లి నాయకులు జంగయ్య, భిక్షపతి, వెంకటేశ్, నరేశ్, రవి, రాములు తదితరులు పాల్గొన్నారు.

మంచాల ఎంపీడీఓగా బాలశంకర్



ఎంపీడీఓ శంకర్‌ను సన్మానిస్తున్న అధికారులు

మంచాల: మంచాల మండల ఎంపీడీఓగా బాలశంకర్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన ఎంపీడీఓ బదిలీల్లో మంచాల మండల ఎంపీడీఓగా పనిచేసిన చిలుకూరి శ్రీనివాస్ యాదాద్రి జిల్లా భువనగిరికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో యాదాద్రి జిల్లా భూదాన్ పోచంపల్లి ఎంపీడీఓగా పని చేసిన బాలశంకర్ మంచాల ఎంపీడీఓగా వచ్చారు. బాలశంకర్‌ను ఎంపీఓ తేజ్ సింగ్, పంచాయతి కార్యదర్శులు, మంచాల గ్రామ కో–ఆప్షన్ సభ్యుడు బాలరాజ్ సన్మానించారు.

ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన నరేందర్‌రెడ్డి

యాచారం: యాచారం మండల ఎంపీడీఓగా నరేందర్‌రెడ్డి మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టి ఎంపీపీ కొప్పు సుకన్యను కలిశారు. అనంతరం పలువురు అధికారులతో సమావేశమై అభివృద్ధి, సంక్షేమ పథకాలపై చర్చించారు.

అవమానించడం మంత్రి ఉత్తమ్‌కు తగదు

కడ్తాల్: అసెంబ్లీలో గ్రామ పంచాయతీలను తక్కువ చేస్తూ రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి మాట్లాడటం తగదని సర్పంచ్‌ల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన మాట్లాడారు. సోమవారం అసెంబ్లీ పలు అంశాలపై చర్చ జరుగుతున్న సమయంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే హరీశ్‌రావును ఉద్దేశించి, గ్రామ పంచాయతీల్లో మాట్లాడినట్లు చిల్లరగా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేయడం, తెలంగాణలో ఉన్న 12,769 గ్రామ పంచాయతీలను అవమానించినట్లేనని అన్నారు. గ్రామ పంచాయతీల్లో గ్రామాభివృద్ధి కోసమే చర్చిస్తామని గుర్తు చేశారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎంపీటీసీ లచ్చిరామ్‌నాయక్, మాజీ సర్పంచ్‌లు కృష్ణయ్య, తులసీరాం, శ్రీను, నాయకులు రాజేందర్, రాంచంద్రయ్య, అశోక్, జగన్ తదితరులు ఉన్నారు.

రాయపోల్‌లో పశువైద్య శిబిరం



పశువులకు వైద్యం చేస్తున్న వైద్యులు

ఇబ్రహీంపట్నం: పశుసంవర్ధక శాఖ, సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో మంగళవారం రాయపోల్ గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎంపీటీసీలు గంగిరెడ్డి జ్యోతి, శ్రీశైలం ఈ శిబిరాన్ని ప్రారంభించారు. పశువులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బల్వంత్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం పశువైద్యశాల సహాయ సంచాలకులు వసంతకుమారి, పశువైద్యాధికారులు సురేశ్‌బాబు, సుధ, సిబ్బంది పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల సత్తా

బడంగ్‌పేట్: బడంగ్‌పేటలోని దిల్‌సుఖ్‌నగర్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు నేషనల్ కరాటేలో సత్తా చాటారు. ఇటీవల నిర్వహించిన నీజీ షోటోకాన్ నేషనల్ ఓపెన్ చాంపియన్ షిప్ ఏపీలోని వైజాగ్‌పోర్టులో నిర్వహించారు. ఈ పోటీలకు బడంగ్‌పేటలోని దిల్‌సుఖ్‌నగర్ పబ్లిక్ స్కూల్ నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. అందులో జోషిక (బంగారు, వెండి) పునర్విక (రజతం), హర్షిత్ (రజతం, కాంస్యం), అక్షిత్‌రామ్ (బంగారు, వెండి), భువన్(రజతం), యువానంద్ అఖీల్ (రజతం) తదితర విద్యార్థులు పతకాలు సాధించారు. మంగళవారం పాఠశాల సమావేశం ఏర్పాటు చేసి కరాటేలో పతకాలు సాధించిన విద్యార్థులను యాజమాన్యం అభినందించారు. కార్యక్రమంలో చైర్మన్ ఏపీఎన్ రెడ్డి, డైరెక్టర్ విజేత, ప్రిన్సిపాల్ చంద్రకళ సిబ్బంది పాల్గొన్నారు.

గృహలక్ష్మి నమోదు కేంద్రం ప్రారంభం

మీర్‌పేట: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలతో పాటు ఇతర హామీలన్నింటిని అమలు చేయాలని మీర్‌పేట కార్పొరేషన్ 27వ డివిజన్ కార్పొరేటర్ పసునూరి భిక్షపతిచారి అన్నారు. గృహలక్ష్మిలో భాగంగా మంగళవారం సిర్లాహిల్స్ కాలనీలో 200 యూనిట్ల లోపు ఉన్న విద్యుత్ వినియోగదారులకు అవగాహన కల్పించారు. అనంతరం కాలనీలో తాత్కాలిక నమోదు కేంద్రాన్ని కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ పథకానికి సంబంధించి విద్యుత్ బిల్లు, ఆధార్, రేషన్‌కార్డుతో కేంద్రానికి వెళ్లి నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న స్వప్న తదితరులు

చైర్‌పర్సన్ స్వప్న

హయత్‌నగర్: మున్సిపాలిటీలో శరవేగంగా కాలనీలు విస్తరిస్తున్నాయని, పెరుగుతున్న కాలనీలకు మౌలిక వసతుల కల్పించేందుకు కృషి చేస్తున్నామని పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ స్వప్న అన్నారు. మంగళవారం పసుమాములలోని మంజీరాకాలనీలో డ్రైనేజీ, సీసీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంచినీటి సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు శంకరయ్యగౌడ్, డీఈఈ అశోక్‌కుమార్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, ప్రతాప్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మాధవచారి, శంకర్‌గౌడ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బంజారా సంస్కృతిని కాపాడుకోవాలి

జెడ్పీటీసీ దశరథ్‌నాయక్



ఆడియో రిలీజ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ తదితరులు

కడ్తాల్: బంజారాల సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు గిరిజనులు, యువత కృషి చేయాలని జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ పిలుపునిచ్చారు. బంజారా యువకుల ఆధ్వర్యంలో నిర్మిస్తున్న దొరసాని యూట్యూబ్ సినిమాకు సంబంధించిన ఆడియో రిలీజ్ పోస్టర్‌ను మంగళవారం మండల కేంద్రంలో స్థానిక నాయకులతో కలిసి జెడ్పీటీసీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్ ఎల్ఎన్‌రెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ సేవ్యా, మాజీ వార్డు సభ్యులు బీమన్, శ్రీను, రాజశేఖర్, సూర్య తదితరులు ఉన్నారు.

ఐదేళ్లలో మూడు ఉద్యోగాలు

కడ్తాల్: మండల పరిధిలోని కర్కల్‌పహాడ్ గ్రామానికి చెందిన మధు ఐదేళ్లలో మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. 2019లో రైల్వే శాఖలో ఉద్యోగం సాధించగా, ఆ తర్వాత పంచాయతీ కార్యదర్శిగా ఎంపికయ్యాడు. ప్రస్తుతం రైల్వేలో ఉద్యోగం చేస్తూనే, ప్రభుత్వ గురుకుల పాఠశాల లైబ్రేరియన్‌గా ఉద్యోగం సాధించాడు. యువతకు మధు ఆదర్శంగా నిలిచాడని గ్రామస్తులు కొనియాడారు. భవిష్యత్తులో మధు మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు.

శ్రవణ్‌కుమార్‌కు అభినందనలు

మండల పరిధిలోని మైసిగండి గిరిజన ఆశ్రమ పాఠశాలలో కాంట్రాక్ట్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న శ్రావణ్‌కుమార్ తెలంగాణ గురుకుల పాఠశాల ఇంగ్లిష్ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఈ మేరకు మంగళవారం మైసిగండి ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రవణ్‌కుమార్‌ను అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మంజుల, రమ్య, భగవతి, సంతోష్‌కుమార్, వెంకటయ్య, సరిత తదితరులు ఉన్నారు.

గ్రామీణ రోడ్లకు ప్రాధాన్యత

- సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.2.20 కోట్లు
- జిల్లా ఎంపీటీసీల సంఘం గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: గ్రామీణ రోడ్ల నిర్మాణ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని జిల్లా ఎంపీటీసీల సంఘం గౌరవ అధ్యక్షుడు, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కడ్తాల్ మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద, సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.2.20 కోట్లు మంజూరైనట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. మండల పరిధిలో 43 సీసీ రోడ్ల నిర్మాణాలకు ప్రభుత్వం రూ.2.20 కోట్ల నిధులను కేటాయించిందని తెలిపారు. ఒక్కో సీసీ నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున నిధులు కేటాయించడం జరిగిందని తెలిపారు. రెండవ విడతలో మరిన్ని గ్రామాల్లో సీసీ నిర్మాణాల నిధుల మంజూరుకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ప్రతిపాదనలు రూపొందించినట్లు తెలిపారు. మండల కేంద్రంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు ఎమ్మెల్యే ప్రత్యేక కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు జహంగీర్‌బాబా, మల్లేశ్‌గౌడ్, సత్యం యాదవ్, రాజేశ్ తదితరులు ఉన్నారు.

విటమిన్ ఏ చుక్కల మందు పంపిణీ



విటమిన్ ఏ మందు వేస్తున్న ఎంపీపీ కృపేష్

ఇబ్రహీంపట్నం రూరల్: తొమ్మిది నెలల నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులకు విటమిన్ ఏ చుక్కల మందు వేయాలని ఇబ్రహీంపట్నం ఎంపీపీ కృపేష్ పేర్కొన్నారు. చిన్నారుల్లో విటమన్ల లోపం లేకుండా చూడాలన్నారు. మండలంలోని పోచారం గ్రామంలో విటమిన్ ఏ చుక్కల మందు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి ఇంద్రాసేనారెడ్డి, అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఆరుట్ల గ్రామంలో..

మంచాల: ఐదేళ్ల లోపు చిన్నారులకు విటమిన్ ఏ చుక్కల మందు వేయాలని ఆరుట్ల ఎంపీటీసీ సభ్యుడు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేశ్ అన్నారు. మండల పరిధిలోని ఆరుట్ల గ్రామంలోని 5వ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్న పిల్లలకు భవిష్యత్‌లో రేచీకటి రాకుండా విటమిన్ ఏ మందు తాగించారు. అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

నల్లగొండకు తరలిన ‘గులాబీ’ దండు



తుర్కయంజాల్ నుంచి బయలుదేరిన బీఆర్ఎస్ శ్రేణులు

ఆమనగల్లు: కృష్ణా జలాల్లో తెలంగాణ రాష్ట్ర వాటా సాధన కోసం నల్లగొండలో నిర్వహించిన మాజీ సీఎం కేసీఆర్ బహిరంగ సభకు ఆమనగల్లు మండలం నుంచి పెద్ద ఎత్తున బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సభకు వెళ్లేందుకు బస్సులు ఏర్పాటు చేశారు. తరలిన వారిలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు అర్జున్‌రావు, నాయకులు పరమేశ్, వెంకటయ్య, కుమార్, కృష్ణ, జంగయ్య, కేశయ్య, లక్ష్మణ్, సురేశ్, బాలరాజు, మల్లేశ్, నర్సింహ, రామకృష్ణ, రమేశ్, విజేందర్ తదితరులు ఉన్నారు.

సభకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

తుర్కయంజాల్: బీఆర్ఎస్ పార్టీ నల్లగొండ పట్టణంలో మంగళవారం నిర్వహించిన చలో నల్లగొండ కార్యక్రమానికి మున్సిపాలిటీ పరిధిలోని 24 వార్డుల నుంచి ఆ పార్టీ శ్రేణులు పెద్దఎత్తున తరలివెళ్లారు. ఆ పార్టీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, సంజీవరెడ్డి, గుండ్ల రాజిరెడ్డి, అంజయ్య, వెంకట్‌రెడ్డి, రఘునాథ్ గౌడ్, చిన్నయ్య, వెంకటేశ్, రాజుగౌడ్ నల్లగొండకు వెళ్లిన వారిలో ఉన్నారు.

నల్లగొండ సభకు బీఆర్ఎస్ నాయకులు

యాచారం: నల్లగొండ జిల్లా కేంద్రంలో సీఎం కేసీఆర్ చేపట్టిన బహిరంగ సభకు యాచారం మండలం నుంచి బీఆర్ఎస్ నాయకులు, శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి పాశ్చ బాషాల ఆధ్వర్యంలో పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు.

మాడ్గుల మండలం నుంచి..

మాడ్గుల: రాష్ట్రానికి సంబంధించిన సాగు నీటి ప్రాజెక్టులను కేంద్ర ప్రభుత్వానికి అప్పగించడాన్ని నిరసిస్తూ నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ బహిరంగ సభకు మాడ్గుల మండలం నుంచి మంగళవారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. సభకు వెళ్లిన వారిలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు చంటి, నాయకులు లాలయ్య గౌడ్, అనిల్, తిరుపతయ్య, చెన్నకేశవులు, మల్లేశ్, సత్తయ్య, వీరయ్య, బక్కయ్య తదితరులు ఉన్నారు.

శ్రీనివాసుయాదవ్, రెహమాన్ ఆధ్వర్యంలో

తలకొండపల్లి: కృష్ణానదిపై నిర్మించిన ప్రాజెక్టులపై రాష్ట్ర హక్కుల కోసం నల్గొండలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నల్లగొండలో భారీ బహిరంగను నిర్వహించారు. సభకు తలకొండపల్లి మండల కేంద్రం నుంచి మంగళవారం మాజీ ఎంపీపీ శ్రీనివాసుయాదవ్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ రెహమాన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో నల్లగొండకు వెళ్లారు. కార్యక్రమంలో దస్తగిరి, విజయ్‌కుమార్‌రెడ్డి, యాదయ్య, సుధాకర్, అశోక్, కృష్ణయ్య, మల్లేశ్, సంపత్, శ్రీశైలం, సత్యంగౌడ్, వినోద్, భగవంత్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణకు అన్యాయం

ఇబ్రహీంపట్నం రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వ తొందరపాటు నిర్ణయాలతో తెలంగాణ ప్రజలకు తీరని అన్యాయం జరిగిందని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి విమర్శించారు. కృష్ణా నీటి ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించాలని జరుగుతున్న కుట్రలను వ్యతిరేకంగా నల్లగొండలో మంగళవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బహిరంగ సభ జరిగిందన్నారు. కృష్ణానది ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించడం కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయమని మండిపడ్డారు. పదేండ్లుగా కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి పెట్టిన కేసీఆర్ ప్రభుత్వం తలొగ్గలేదని గుర్తు చేశారు. ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నెల రోజుల లోపే ప్రాజెక్టులు అప్పగింత ఒప్పందాలపై సంతకాలు చేయడం సిగ్గు చేటన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రయ్య, నర్మద, బుగ్గరాములు, రమేష్, బాషా, భాస్కర్‌రెడి పాల్గొన్నారు.